క్లుప్తంగా

నేడు కానూరులో చేయూత చెక్కులు పంపిణీ

పెనమలూరు: కానూరులో చేయూత చెక్కులు పంపిణీ కార్యక్రమం మంగళవారం ఉంటుందని తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ ఎం. వెంకటేశ్వరరావు అన్నారు. ఆయన సోమవారం వివరాలు తెలుపుతూ మంగళవారం సాయంత్రం 5 గంటలకు కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్స్‌లో కార్యక్రమం ఉంటుందన్నారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి, పెనమలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కన్వీనర్ జోగి రమేష్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తారన్నారు.

యనమలకుదురు వాసులకు..
యనమలకుదురు వాసులకు అదే రోజు కాలేజీ గ్రౌండ్స్‌లో ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ కార్యక్రమం ఉంటుందని కమిషనర్ వెంకటేశ్వరరావు అన్నారు. ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులకు స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలు మంత్రి జోగి రమేష్ అందజేస్తారన్నారు.

హెచ్ఐవీ బాధితులకు న్యూట్రిషన్ సరుకుల పంపిణీ

గన్నవరం: స్థానిక బీసీ కమ్యూనిటీ హాలులో సోమవారం రాష్ట్ర, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థల నేతృత్వంలో చైల్డ్ ఫండ్ లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా 40 మంది హెచ్ఐవీ బాధితులకు పొట్టిపాడుకు చెందిన వన్‌వే మిషన్ సంస్థకు చెందిన స్వర్ణజోయల్ కొడాలి న్యూట్రిషన్ సరుకులను అందజేశారు. అనంతరం సీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ షాహినా, డాక్టర్ కీర్తి మాట్లాడుతూ హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులు సరైనా ఆహార, ఆరోగ్య జాగ్రత్తలను పాటించాలని చెప్పారు. క్రమం తప్పకుండా ఏఆర్టీ మందులు వాడడంతో పాటు ఆరు నెలలకు ఒకసారి సీడీ ఫోర్ వైరల్ లోడ్ టెస్ట్ చేయించుకోవాలని సూచించారు. రిటైర్డ్ పారా మెడికల్ ఆఫీసర్ పోలిమెట్ల జయరాజు ఐసీటీసీ కౌన్సిలర్ రాజశేఖర్, లింక్ వర్కర్ స్కీమ్ ప్రతినిధులు శ్రీరామ్‌శ్రీనివాస్ కల్యాణ్, లక్ష్మీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఉచిత శిక్షణ తరగతులు

పెనమలూరు: పోరంకిలో ఈ నెల 13వ తేదీ నుంచి ఉచిత నైపుణ్య శిక్షణను ప్రారంభిస్తున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్. శ్రీనివాసరావు తెలిపారు. ఆయన సోమవారం వివరాలు తెలుపుతూ ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పోరంకి శ్రీనివాసానగర్‌లోని ఏపీఎస్ఎస్‌డీసీ భాగస్వామ్య హ్యాపీ మైండ్స్ ట్రెనింగ్ సెంటర్‌లో సోషల్‌మీడియా ఎగ్జిక్యూటివ్ కోర్సుపై ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నామన్నారు. శిక్షణకు ఏదైనా డిగ్రీ పూర్తి చేసి ఉండాలని తెలిపారు. 13వ తేదీన కౌన్సెలింగ్ అనంతరం శిక్షణ తరగతులు ప్రారంభిస్తామన్నారు. శిక్షణ పూర్తి చేసిన వారికి ప్రైవేటు రంగ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. అలాగే ఉద్యోగ అవకాశలకు దరఖాస్తులు అభ్యర్థుల నుంచి స్వీకరిస్తామని అన్నారు. అభ్యర్థులు పోరంకిలోకి హ్యాపీ మైండ్స్ ట్రెనింగ్ సెంటర్‌కు ధ్రువపత్రాలతో పాటు ఆధార్, ఫొటో అందజేయాలని అన్నారు. మరిన్ని వివరాలకు 6302764088, 9701935014 ఫోన్ నంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలని సూచించారు.

జాతీయ స్థాయిలో మెరిసిన ఎన్ఆర్ఐ మెడికల్ విద్యార్థి



తాడేపల్లిరూరల్ : మంగళగిరి ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీలో చదువుతున్న విద్యార్థి, విజయవాడ సమీపంలోని పోరంకికి చెందిన తోట నాగ రఘునందన్‌కు అరుదైన గౌరవం లభించింది. ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీలో డీఎం కార్డియాలజీ ఫైనల్ ఇయర్ చదువుతున్న తోట నాగ రఘునందన్ ఈ నెల 8,9,10 తేదీల్లో ముంబైలో జాతీయ స్థాయిలో ఇకో ఇండియా 2024 సదస్సులో కంజనేటల్ హార్ట్ డిసీజ్ (పుట్టుకతో వచ్చే హృద్రోగ సమస్య)పై పరిశోధన చేసి రెండో స్థానంలో నిలిచి బహుమతి సాధించారు. కర్ణాటక బెంగళూరుకు చెందిన జయదేవ ఇన్‌స్టిట్యూట్ మాజీ హెచ్ఓడీ ఇకో ఇండియా ప్రెసిడెంట్ - ఇలెక్ట్ డాక్టర్ విజయలక్ష్మి నాగ రఘునందన్‌కు బహుమతితో పాటు పది వేల రూపాయల నగదు అందజేశారు. సోమవారం మెడికల్ కాలేజీకి వచ్చిన రఘునందన్‌కు ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజి డాక్టర్లు, ప్రొఫెసర్లు, శుభాకాంక్షలు తెలియజేస్తూ స్వాగతించారు.

సమపాళ్లలో అభివృద్ధి, సంక్షేమం

- రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్
- కంకిపాడు మండలంలోని పలు గ్రామాల్లో విస్తృత పర్యటన
- పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు



పునాదిపాడులో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రి జోగి రమేష్

కంకిపాడు: అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. కంకిపాడు మండలంలోని కంకిపాడు, పునాదిపాడు, ఈడుపుగల్లు గ్రామాల్లో మంత్రి జోగి రమేష్ సోమవారం విస్తృతంగా పర్యటించారు. కంకిపాడు పద్మావతి నగర్‌లో రూ. 14 లక్షలు అంచనా వ్యయంతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని మంత్రి ప్రారంభించారు. పునాదిపాడులో రూ. 28 లక్షలు అంచనా వ్యయంతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ. 26 లక్షలు అంచనా వ్యయంతో నిర్మించిన హెల్త్ వెల్‌నెస్ సెంటర్ భవనాన్ని ప్రారంభించారు. రూ. 19.20 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న మద్దూరు–ఉప్పలూరు ఆర్అండ్‌బీ రోడ్డు పనులకు ఈడుపుగల్లు ప్రధాన సెంటరులో శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. పొక్లెయినర్‌తో పనులను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటుచేసిన సభల్లో మంత్రి రమేష్ మాట్లాడుతూ దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. అవసరమైన నిధులను కేటాయించి అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తయ్యేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో కేడీసీసీ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి, జెడ్పీటీసీ బాకీ బాబు, జేసీఎస్ చైర్మన్ రాచూరి చిరంజీవి, ఏఎంసీ వైస్ చైర్మన్ మాదు వసంతరావు, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ రామినేని రమాదేవి, మాజీ ఎంపీపీ మాదు శ్రీహరిరాణి, సర్పంచ్‌లు బాకీ రమణ, ముసిబోయిన విజయకుమారి, సంగెపు శ్రీనివాసరావు, చిప్పల రామదాసు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో సమస్యలు పరిష్కరిస్తాం



వణుకూరు జగనన్న కాలనీలో మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్

పెనమలూరు: జగనన్న కాలనీలో లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలు వెంటనే పరిష్కారిస్తానని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి, పెనమలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయ కర్త జోగి రమేష్ అన్నారు. మంత్రి సోమవారం వణుకూరు గ్రామంలో 3, 4 లే అవుట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మంత్రి దృష్టికి పలు సమస్యలు తీసుకువచ్చారు. కాలనీలో ప్రధాన రహదారి నిర్మాణం చేయాలని, విద్యుత్ సరఫరా, నీటి సరఫరా చేయాలని కోరారు. దీనిపై మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ జగనన్న కాలనీలో లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలు వెంటనే పరిష్కారం చేస్తాన్నారు. ప్రాధాన్యత క్రమంలో దశల వారీగా రహదారులు నిర్మాణం చేస్తామన్నారు. కార్యక్రమంలో గృహనిర్మాణ వాఖ ఈడీ చంద్రశేఖర్ రావు, ఎస్ఈ నాగభూషణం, పీడీ సూర్యనారాయణ, ఈఈలు రవికాంత్, నిరీక్షణరావు, డీఈ శివప్రసాద్, ఏఈ అబ్దుల్ జిలాని, ఎంపీడీఓ కుమార్‌బాబు, తహసీల్దార్ ప్రసాద్, వైఎస్సార్ సీపీ నేతలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల నెరవేర్చిన సీఎం జగన్



నున్నలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి

నున్న(విజయవాడరూరల్): సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పేదల సొంతింటి కలను నెరవేర్చారని జెడ్పీటీసీ కె.సువర్ణరాజు, ఎంపీపీ చెన్ను ప్రసన్న కుమారి అన్నా రు. సోమవారం నున్న గ్రామంలో పేదలకు ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చేసిన ఇళ్లపట్టాల పంపిణీ కార్యక్రమం గ్రామ సర్పంచి కాటూరి సరళ అధ్యక్షతన జరిగింది. సంక్షేమ పథకాలు అమలు చేయడంలో, అభివృద్ధి పనులు చేయడంలో సీఎం ముందంజలో ఉన్నారని, ఆయన చేసిన మేలులను మరవకుండా వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటే పథకాలు కొనసాగుతాయని వారు అన్నారు. సర్పంచి కాటూరి సరళ, వైఎస్సార్‌సీపీ గన్నవరం నియోజకవర్గం ఎన్నికల ఇన్‌చార్జి ఆర్.వెంకటేశ్వరావు, ఉపసర్పంచి కలకోటి బ్రహ్మానందరెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు బొంతు సరోజిని, ప్రసాద్‌రెడ్డి, ప్రత్తిపాటి రవీంద్ర, గిరిజాకుమారి, మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు తగరంరవీంద్ర, మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ హుస్సేన్ పాల్గొన్నారు.

పాతపాడులో..
పాతపాడు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద పేదలకు ఇళ్లపట్టాల పంపిణీ సోమవారం జరిగింది. గ్రామ సర్పంచి దేవగిరి సుజాత, పార్టీ నాయకులు దేవగిరి ఓంకార్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ మేలు చేసిన ప్రభుత్వం
గన్నవరం రూరల్: ప్రతి ఒక్కరికీ మేలు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య అన్నారు. సోమవారం సూరంపల్లి గ్రామంలో రిజిస్ట్రేషన్ పూర్తి చేసిన 192 జగనన్న ఇంటి పట్టా దస్తావేజులను ఆయన పార్టీ నాయకులతో కలసి పంపిణీ చేశారు. వీఆర్వో కె.అర్జునరావు, సహకార బ్యాంకు అధ్యక్షుడు తుల్లిమిల్లి ఏడుకొండలు, సీనియర్ వైఎస్సార్ సీపీ నాయకులు కందిమళ్ల శ్రీనివాసరావు, మండల వ్యవసాయ సలహా మండలి డైరెక్టర్ పాముర్తి మాధవ, రామచంద్రాపురం కన్వీనర్ సర్నాల రాంబాబు పాల్గొన్నారు.



రిజిస్ట్రేషన్ పట్టాలు అందజేస్తున్న తోట వెంకయ్య, ఏడుకొండలు తదితరులు

రిజిస్ట్రేషన్ ఇళ్ల పట్టాల పంపిణీ చారిత్రాత్మకం
ఉంగుటూరు: గత ప్రభుత్వాలు ఎన్నడూ చేయని విధంగా పేదలకు ఇచ్చే ఇళ్ల స్థలాలు, ఇళ్లపై పూర్తి హక్కు కల్పిస్తూ కన్వేనియన్స్ డీడ్, సేల్ డీడ్‌ను జగనన్న ప్రభుత్వం అందజేయడం చారిత్రాత్మకమని ఎంపీపీ వడ్లమూడి సరోజిని, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వింత శంకర్‌రెడ్డి అన్నారు. తేలప్రోలులో సోమవారం జరిగిన ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఎంపీపీ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వింత శంకర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. 336మంది లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పట్టాలు అందజేశారు. అదే విధంగా పలు గ్రామాల్లో జగనన్న కాలనీ లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పట్టాలు ప్రజా ప్రతినిధులు, అధికారులు పంపిణీ చేశారు. జేసీఎస్ మండల కన్వీనర్ వింత ఆదినారాయణరెడ్డి, సర్పంచ్ లాం దిబోర, ఎంపీటీసీ తియ్యగూరవాణి, తహసీల్దార్ సుబ్బారావు పాల్గొన్నారు.

‘పది’ విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

హనుమాన్‌జంక్షన్ రూరల్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరుకానున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కల్వరి శక్తి ప్రార్థనామందిరం (వేలేరు) ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రిని ఉచితంగా పంపిణీ చేశారు. బాపులపాడు మండలంలోని వేలేరు, రేమల్లే, మల్లవల్లి, అప్పనవీడులోని జెడ్పీ హైస్కూళ్లలో దాదాపు 300 మంది పది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు, జ్యామెట్రీ బాక్స్‌లను ఉచితంగా పంపిణీ చేశారు. కల్వరి శక్తి ప్రార్థనా మందిరం పాస్టర్ భూక్యా బాలరాజు పాల్గొన్నారు.

ముస్లిం, మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట



సీసీ డ్రెయిన్‌కు శంకుస్థాపన చేస్తున్న ప్రజాప్రతినిధులు

గన్నవరం: ముస్లిం మైనార్టీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎంపీపీ అనగాని రవి అన్నారు. స్థానిక ఇస్లాంపేటలోని ముస్లిం షాదీఖానాపై మండల పరిషత్, జిల్లా పరిషత్, ఎంపీ నిధులు సంయుక్తంగా రూ. 35 లక్షలతో నూతనంగా నిర్మించిన కల్యాణ మండపాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ నియోజకవర్గంలోని ముస్లింలకు ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ అన్ని రకాలుగా అండగా నిలుస్తున్నారని చెప్పారు. ముస్లింల సౌకర్యార్థం షాదీఖానాపై అంతస్తు నిర్మాణానికి వంశీమోహన్ ఆదేశాల మేరకు మండల పరిషత్ ద్వారా రూ. 10 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. షాదీఖానా విస్తరణకు సహకరించిన ప్రతిఒక్కరికీ జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎండీ గౌసాని కృతజ్ఞతలు తెలియజేశారు. కల్యాణ మండపంలో ఏసీలు ఏర్పాటుకు జెడ్పీ నిధులు అదనంగా రూ. 5 లక్షలు కేటాయించినట్లు చెప్పారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కాసరనేని గోపాలరావు, సర్పంచి నిడమర్తి సౌజన్య, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ కరీముల్లా, జెడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యులు ఎస్‌కెఎంఎంఏ. కలాం, అంజుమన్ కమిటీ కార్యదర్శి ఎండీ అజీజ్‌ఖాన్, కోశాధికారి కరిముల్లాఖాన్, మాజీ కోఆప్షన్ సభ్యుడు హాజీ బాషా తదితరులు పాల్గొన్నారు.

సీసీ డ్రెయిన్‌కు శంకుస్థాపన..
అనంతరం చేపట మార్కెట్ వద్ద రూ. 12 లక్షలతో నిర్మించనున్న సీసీ డ్రెయిన్‌కు ఎంపీపీ, సర్పంచ్ ఇతర ప్రజాప్రతినిధులు శంకుస్థాపన చేశారు. ఎంపీటీసీ సభ్యులు త్రిపురనేని బాబీ, వార్డు సభ్యురాలు సగ్గుర్తి చంద్రిక, సూరం విజయలక్ష్మి వింత జయగీత, షేక్ షుకూర్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ మాసం ప్రారంభం

గన్నవరం రూరల్: నెలవంక దర్శనంతో సోమవారం నుంచి రంజాన్ మాసం ప్రారంభమైందని ముస్తాబాద జామియా మసీద్ ఇమాం ఇక్బాల్ చెప్పారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మంగళవారం నుంచి ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభమవుతాయని తెలిపారు.

మహిళ కార్మికులకు సన్మానం

పెనమలూరు: మహిళా కార్మికులను సోమవారం ఐద్వా ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. తాడిగడప కార్మికనగర్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో కృష్ణా జిల్లా ఐద్వా సంఘం కార్యదర్శి జ్యోతి మాట్లాడుతూ మహిళా కార్మికులు ఉన్నత సేవలు అందించినందున మహిళా కార్మికులను ఘనంగా సన్మానించామన్నారు. వివిధ కార్మిక, ఉద్యోగ సంఘాలకు చెందిన లక్ష్మీప్రసన్న, నారిన సూర్యవతి, కంచర్ల పద్మ, సీహెచ్ లక్ష్మి లను ఘనంగా సన్మానం చేశారు.

చికిత్స పొందుతూ ఉపాధ్యాయురాలి మృతి

రామవరప్పాడు: అనారోగ్యంతో హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ఓ ఉపాధ్యాయురాలు పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందారు. సేకరించిన వివరాల ప్రకారం.. రామవరప్పాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాయామ టీచర్‌గా పుష్పరాణి విధులు నిర్వర్తిస్తున్నారు. వారం రోజుల క్రితం పాఠశాలలోనే అనారోగ్యానికి గురయ్యారు. తోటి ఉపాధ్యాయులు స్థానిక ఆర్ఎంపీ వైద్యుడితో ప్రథమ చికిత్స చేయించి, ఆమె కుమారుడి సాయంతో హాస్పటల్‌కు తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించి పుష్పరాణి మృతి చెందారు.

6 నెలల క్రితమే భర్త మృతి..
ఆరు నెలల క్రితం ప్రభుత్వ ఉపాధ్యాయుడైన పుష్పరాణి భర్త జయరాజు కూడా మృతి చెందారు. దీంతో కుటుంబ సభ్యులు శోక సముద్రంలో మునిగిపోయారు. మృతి చెందిన జయరాజు, పుష్పరాణి దంపతులకు కుమారుడు, కుమార్తె సంతానం. కుమారుడు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కాగా.. కుమార్తె బీటెక్ పూర్తి చేసి ఎంఎస్ చేసేందుకు ఇటీవల విదేశాలకు వెళ్లింది.

వైఎస్సార్ సీపీ నూతన గ్రామ కమిటీ ఎన్నిక



గొల్లనపల్లిలో నూతన గ్రామ, యూత్ కమిటీలను అభినందిస్తున్న నాయకులు

గన్నవరం రూరల్: మండలంలోని గొల్లనపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి వైఎస్సార్ సీపీ నూతన గ్రామ కమిటీ ప్రమాణ స్వీకారం, యూత్ ఆత్మీయ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా ఎంపీపీ అనగాని రవి పాల్గొని మాట్లాడుతూ లబ్ధిదారుల గడపకు సంక్షేమ పథకాలను చేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదని చెప్పారు. చేసిన మంచి పనులను యువత ప్రచారం చేయాలని సూచించారు. గ్రామ పార్టీ అధ్యక్షుడిగా పలగాని శోభనాద్రి, ప్రధాన కార్యదర్శిగా మెండే రమేష్, ఉపాధ్యక్షుడిగా పులపాక శ్యామ్యూల్, బీసీసెల్ అధ్యక్షుడిగా కొలుసు కోటేశ్వరరావు బాధ్యతలు తీసుకున్నారు.వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయం కోసం పని చేస్తామని ప్రమాణస్వీకారం చేశారు. అలాగే బూదాటి రాజేష్, దోమా రవి, పులపాక రూపేష్, కొమరవల్లి రాకేష్, కర్నాటి శ్రీనివాసరావులకు కూడా కీలక బాధ్యతలు అప్పగించారు. తొలుత బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక సీనియర్ నాయకులు ప్రసాదం, కుమార్, మధు, రమేష్, పడమట సురేష్, దద్దనాల రామారావు, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య, జిల్లా క్రిస్టియన్ మైనారిటీ సెల్ కార్యదర్శి పోలిమెట్ల జయరాజు, రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాలతో సంక్షేమం చేరువ



తేలప్రోలు సచివాలయ భవనం ప్రారంభోత్సవంలో ఎంపీపీ సరోజిని

ఉంగుటూరు: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేసేందుకు ఏర్పాటు చేసిన సచివాలయాల సత్ఫలితాలిస్తున్నాయని ఎంపీపీ వడ్లమూడి సరోజిని అన్నారు. తేలప్రోలులో రూ.91లక్షలతో నూతనంగా నిర్మించిన సచివాలయం–2, ఆర్‌బీకే, రెండు వెల్‌నెస్ సెంటర్ల భవనాలను ఎంపీపీ, సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకులు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటి వరకు అద్దె భవనాల్లో కొనసాగిన సేవలు నేటి నుంచి సొంత భవనాల నుంచి సేవలు కొనసాగిస్తారని చెప్పారు. అభివృద్ధికి సాక్ష్యాలుగా సచివాలయాలు నిలిచాయని పేర్కొన్నారు. సర్పంచ్ లాం దిబోర, ఎంపీటీసీ తియ్యగూర వాణి, ఈవోపీఆర్‌డీ అమీర్ బాషా, తహసీల్దార్ జీవీ సుబ్బారావు, మండల జేసీఎస్ కన్వీనర్ ఆదినారాయణ రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

మోసగాళ్లు వస్తున్నారు.. జాగ్రత్త!

మంత్రి జోగి రమేష్



మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్

ఉయ్యూరు: ఎన్నికల వేళ మోసం చేసేందుకు వస్తున్నారని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. ఉయ్యూరు పట్టణంలోని ప్రధాన సెంటర్‌లో వైఎస్సార్ చేయూత చెక్కులు, టిడ్కో గృహాల లబ్ధిదారుల రాయితీ సొమ్ము, పేదల ఇళ్లస్థలాల పట్టాల పంపిణీ సోమవారం రాత్రి చేపట్టారు. ఈ సందర్భంగా జరిగిన సభలో 4,809 మంది చేయూత లబ్ధిదారులకు రూ 4.84 కోట్లు చెక్కును అందించారు. రూ. 50 లక్షల చెక్కును టిడ్కో లబ్ధిదారులకు అందజేసి 4,699 మంది లబ్ధిదారులకు ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్ దస్తావేజులు పంపిణీ చేశారు. మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ ప్రజలకు మంచి చేయడమే సీఎం జగనన్నకు తెలునన్నారు. సభలో కేడీసీసీ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి, సీడీసీ చైర్మన్ రాజులపాటి రామచంద్రరావు, ఎంపీపీ చీలి కల్పన, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు సోలే సురేష్ బాబు, అర్షతున్నీసాబేగం, పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ అబు కలాం, ప్రభుత్వాస్పత్రి చైర్మన్ జంపాన కొండలరావు, కంకిపాడు జెడ్పీటీసీ బాకీ బాబు పాల్గొన్నారు.

పెనమలూరు అభివృద్ధికి అధిక ప్రాధాన్యం



పెనమలూరులో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న జోగి రాజీవ్

పెనమలూరు: పెనమలూరు గ్రామాభివృద్ధికి జగనన్న ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్ అన్నారు. పెనమలూరు గ్రామంలో రూ 1.20 కోట్లతో నిర్మించిన మూడు సచివాలయాల భవనాలు, రూ. 1.52 కోట్లతో నిర్మాంచిన పల్లిపేట, చెరువ కట్ట, జగనన్న కాలనీ రోడ్లను ఆయన ప్రారంభించి ప్రసంగించారు. కార్యక్రమంలో సర్పంచి లింగాల భాస్కర రావు, ఉపసర్పంచి శీలం సుమతి, సొసైటీ అధ్యక్షుడు కొత్తపల్లి వెంకటేశ్వరరావు, వార్డు సభ్యులు, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు చేయూత



కంకిపాడు: అగ్ని ప్రమాద బాధితులకు ప్రతి ఒక్కరూ చేయూత అందించాలని రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. మండలంలోని నెప్పల్లి గ్రామంలో ఇటీవల అగ్ని ప్రమాదం చోటు చేసుకుని ఏడు కుటుంబాలు సర్వం కోల్పోయిన విషయం తెలిసిందే. బాధిత కుటుంబాలను రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు సోమవారం పరామర్శించారు. వంట పాత్రలు, నిత్యావసరాలు అందించారు. దాతలు, స్వచ్ఛంద సంస్థలు ఆపన్నులకు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కార్యదర్శి భవిరి శంకర్‌నాథ్, ట్రెజరర్ కొండపల్లి రామ్ బాలాజీ పాల్గొన్నారు.

అంతరాలయానికి ప్రత్యేక పూజలు



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న పార్వతీ సమేత రామలింగేశ్వర్వామివారి దేవస్థానం అంతరాలయానికి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. దాతలు వెలగపూడి ఉమామహేశ్వరరావు, విజయలక్ష్మి దంపతుల సాయంతో ఆలయ అంత్రాలయం ముఖ ద్వారం బంగారు తాపడంతో చేశారు. ఈ సందర్భంగా ఏపీ ధార్మిక పరిషత్ సభ్యుడు సంగా నరసింహారావు హారతి ఇచ్చి ప్రత్యేక పూజలు చేశారు.

విద్యాహక్కు చట్టాన్ని పక్కాగా అమలు చేయాలి



గన్నవరం: ప్రభుత్వ విద్యాహక్కు చట్ట ప్రకారం ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలలో 25 శాతం సీట్లు సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన పిల్లలకు కేటాయించాలని ఎంపీపీ అనగాని రవి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉచిత విద్యాహక్కుపై ప్రైవేట్ స్కూల్స్ ప్రిన్సిపాల్స్, హెచ్ఎంలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పేదలందరికీ ఉచిత విద్యను అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ చట్టాన్ని తీసుకువచ్చిందన్నారు. వచ్చే విద్యా ఏడాది నుంచి ప్రతి ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు ఈ చట్టాన్ని అమలు చేయాలని చెప్పారు. ఉచిత విద్యపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతి స్కూల్ ముందు బ్యానర్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఎంపీడీఓ ఈ. సత్యకుమార్, ఎంఈఓ–1 కె. రవికుమార్, ఎంఈఓ–2 కమల తదితరులు పాల్గొన్నారు.

రైతులకు డివిడెంట్ పంపిణీ

గన్నవరం రూరల్: రైతుల సంక్షేమమే లక్ష్యమని ముస్తాబాద సహకార బ్యాంకు పనిచేస్తుందని బ్యాంక్‌చైర్ పర్సన్ మేడసాని శ్రీనివాస్ చౌదరి చెప్పారు. సోమవారం స్థానిక బ్యాంకులో 2021–2022, 2022–2023 సంవత్సరాలకు సంబంధించి రైతులకు రూ.21.55 లక్షలు డివిడెంట్‌ను ఆయన పంపిణీ చేశారు. సీఈవో తగరం గురవయ్య, డైరెక్టర్‌లు నవాబ్ జానీ, కరేటి సాంబశివరావు, సర్పంచ్ వేము రాధాకృష్ణ పాల్గొన్నారు.